
# అందని అనురాగం

మధ్యాహ్నం రెండవుతూ ఉంది.

ఎండ మండిపోతూంది. లోకంలోని గాలి అంతా ఎక్కడో స్తంభించి పోయినట్లుంది.

నిప్పులు చెరుగుతున్న ఎండలో, చెమటలు కక్కుతూ ఐసు బండి తోసుకుంటూ వస్తున్నాడు సీతాలు. ప్రతీ రోజూ ఇదే వేళకి ఈ వీథిలోకి వస్తాడు వాడు. వాడికి పన్నెండేళ్ళు ఉంటాయేమో! సన్నగా, అర్భకంగా ఉంటాడు. నల్లని శరీరం. అలసటవలన లోతుగా పీక్కుపోయిన కళ్ళు దీనంగా చూస్తూ ఉంటాయి.

సీతాలు చొక్కా చెమటతో పూర్తిగా తడిసిపోయింది. ఒళ్లంతా చెమట పట్టిందేమో, జిడ్డుగా తయారైంది. ఒక్క క్షణం నించుని, ఆయాసం తీర్చుకుని మళ్లీ బలంగా బండి ముందుకు నెడుతున్నాడు. చక్రాలు సరిగా లేకపోవటంవల్ల నైతేనేమి, బండి వదులుగా ఊగిసలాడి పోతున్నట్లుండటం



తీర్చుచేస్తే వస్తాయి? ఎన్ని మంచు ముక్కలు కరిగిపోతే వస్తాయి?

ఒక్కటి, ఒక్కటంటే ఒక్క కేజీ బియ్యం కోసం, నాలుగు ఊరుపిండి ఒడియాల కోసం, అణా పకోడీల కోసం తను ఎండలో తిరగాలి. కరుగుతున్న తారురోడ్డుమీద కాళ్ల తొక్క లూడి పోవాలి. తన నెత్తి ఎండలో మాడి మాడి బ్రద్దలయ్యేలా పోటుపెట్టాలి. ఒళ్లంతా చెమటతో చిమచిమలాడాలి. కళ్ళు చీకట్లు కమ్మాలి. బండి నెట్టి నెట్టి చేతులు కందిపోవాలి.

బండీలో మంచుముక్క లున్నాయి కాని, సీతాలు గుండె మండిపోతూంది.

బండీలో చల్లని పానీయా లున్నాయి కాని, సీతాలు గొంతు పిడచకట్టుకు పోతూంది.

సీతాలు తన చేతులతో తాను ఒక్క గ్లాసు షర్బత్తుకూడా కలుపుకుని తాగ లేదు.

ఎందుకంటే —

వాడికి తాను సంపాదించే ప్రతి పైసా విలువ బాగా తెలుసును. వంద పైసలు కూడితేకానీ ఒక్క రూపాయి కాదన్న సంగతి వాడి కెప్పుడూ గుర్తుం టుంది. రెండు ఒడియాల ఖరీదు పన్నెండు పైసలు. పదకొండు పైసలిచ్చి, పైసా బాకీపెడితే చిట్టెమ్మ ఎంత చిర్రుబుర్రు లాడుతుందో వా డెరుగును!

అందుకే ఈ శ్రమ. కాబట్టే ఇలా మండుటెండలో మాడిపోవటం!

కాని, ఇంత శ్రమా ఒక్క కేజీ బియ్యం కోసం, నాలుగు ఊరుపిండి ఒడియాల కోసం!

కాన్నైతే ఈ రోజా ఈ ఎండలో కాళ్లు కాల్చుకోవడం, గొంతు చించు కోవడం, చెమటలు కక్కుకోవటం — కనీసం ఇందుకోసమేనా కాదు.

అయినా బావుండేది.

ఈవేళ అయ్యకి తను మూడు రూపాయ లివ్వాలి. అయ్య పైడితల్లికి అర్ధరూపాయి ఇవ్వాల.

రూపాయిన్నర ఇచ్చి జాబ్బా ఇడిపించు కోవాలి. మరో గళాసుడు పట్టించాల! సీ! సీ! ఎదవ బతుకు! కుక్కబతుకు! సత్తే బావుణ్ను' అనుకున్నాడు సీతాలు చిరాగ్గా తనలో.

ఒకరిద్దరు పిల్లలువచ్చి ఐస్క్రీములు కట్టించుకు వెళ్లారు. సీతాలు డబ్బులన్నీ బల్లచెక్కమీద గుట్టగా పోసి లెక్క పెట్టాడు. రెండున్నర అయింది. పైన ఓ మూడు చిల్లర పైస లున్నాయి.

సీతాలు తృప్తిగా నిట్టూర్చాడు. 'ఈ అబ్బాయిగోరు ఐసుముక్క తీసు కెళ్లాడుగా! దాని కో అర్ధరూపాయి డబ్బు లొస్తాయి. ఆ మూడు అయ్యకి ఇచ్చి వచ్చు. సాయంతరంనోగా మరో రెండు రూపాయలు కూడవా!'

ఇంతకుముందు మంచుముక్క తీసుకువెళ్లిన అబ్బాయి తిరిగి వచ్చాడు. "బొత్తిగా ఎక్కువ ఖరీదు చెప్పావు టయ్యా! మా వాన్నారు వద్దు పొమ్మ న్నారు. ఇంతకన్నా నేరుగా డిపోనుంచి తెప్పిస్తే తక్కువకి వస్తుందన్నారు" అంటూ మంచుముక్క సీతాలు చేతిలో ఉంచేసి ఎవరో తరుముతున్నట్లుగా ఓ ఇంట్లోకి వెళ్లిపోయా డా అబ్బాయి.

అక్షరజ్ఞానంలేని సీతాలుకి ఆ ఇంటి ముందు తలుపుమీద ఉన్న నేమ్‌బోర్డు ఎలా అర్ధమౌతుంది? అర్థమైతే ఆ పేరుకింద ఉన్న డిగ్రీకి ఎంత మంచి ఉద్యోగం దొరుకుతుందో ఊహించి ఉండేవాడు!

సీతాలు కళ్లలో చప్పున నీళ్ళు తిరిగాయి. చేతిలోని మంచుముక్కవేపు నిస్సహాయంగా చూశాడు. తను ఇచ్చి నప్పటికంటే తరుగు బాగా ఉంది! సీతాలుకి వెక్కిళ్ళు వస్తున్నాయి.

వాడి చేతులు మంచుముక్క చలవదనం వల్ల కొంకర్లుపోతున్నాయి.

కాని, వాడి కాళ్ళు కాలిపోతూనే ఉన్నాయి.

చేతులు జివ్వు జివ్వు మంటూనే ఉన్నాయి.

వాడి నెత్తి మాడిపోతూనే ఉంది!

చేతిలో మంచుముక్క కరిగిపోతూంది. వాడి గొంతులో తడి ఆరిపోతూనే ఉంది!

సీతాలుకి కళ్ళు గిర్రుమంటూ తిరిగాయి. కాళ్లు నిస్సత్తువగా తేలి పోయాయి. ఒకపెట్టున స్పృహ తప్పి నేలమీదికి విరుచుకుపడ్డాడు. ఆ పడటంలో సరాసరి బండిచక్రానికి తల తగిలి బలమైన గాయం ఏర్పడింది. రక్తం బయటికి చిక్కగా చిమ్మింది.

స్వామిద్రోహం చేసినదానిలా ఐసు బండీ నిశ్శబ్దంగా నిల్చుని ఉండి పోయింది! ★

కృషి

**కృషితో ఆరోగ్యం. ఆరోగ్యంతో సంతృప్తి ఉత్పన్నమౌతాయి.**

—బిటి

# నదులు, గాథలు

[మన నదులు — వాటి జన్మరహస్యాలను తెలిపే మనోహర గాథలు]

## కావేరి

కావేరీ నది దక్షిణ గంగగా ప్రసిద్ధి చెందింది. అగస్త్య మహర్షి దక్షిణాన గల కొండల్లో తపస్సు చేస్తున్నాడు. మునికి గంగ అవసరం ఏర్పడింది. గంగను ఆరాధించగా ఎదురు ఉన్న ఒక రాతిలో అతనికి గంగ గోచరించింది. గోటితో ఆ రాయి గీసి, ముని గంగను బైటికి తీశాడు. అదే కావేరి జన్మకు కారణమైంది.

ఈ నది పుట్టుకను గూర్చి స్కాంద పురాణంలో ఒక గాధ ఉంది. వృత్రాసురు డనే రాక్షసుడు అంతమైనా, మిగిలిన రాక్షసులు మునుల్ని బాధ పెడుతూనే ఉన్నారు. సముద్రంలో దాగొని, రాత్రి వేళ బైటికి వచ్చి, ఆ రాక్షసులు మునుల్ని పలువిధాలుగా బాధిస్తున్నారు. మునులు విష్ణుదేవునితో మొర పెట్టుకున్నారు. "అగస్త్యుడు సము ద్రంలో గల జలాన్నంతటిని తాగగల సమర్థుడు. సముద్రంలో నీరు లేని నాడు దేవతలు అతి సులువుగా రాక్షసుల్ని వధించగలరు" అని విష్ణువు మును లకు ఉపాయం చెప్పాడు.

మునులు అగస్త్యుని ప్రార్థించారు. అగస్త్య డందుకు అంగీకరించాడు. కాని, మార్గమధ్యంలో వింధ్య పర్వతం అడ్డుగా ఉంది. ఎత్తుగా పెరిగి, ఆ పర్వతం సూర్యగమనాన్నికూడా నిరోధించింది. సూర్యుడు తనకు ప్రదక్షిణ చెయ్య లేదని వింధ్య పర్వతానికి కోపం. ఈ సమస్యనుపరిష్కరించడానికి అగస్త్యుడు శివునిగూర్చి తప మొనర్చి వింధ్యనగాధి పతిని వంచగలిగే శక్తినే కాకుండా, సముద్రజలాన్ని పానం చేయుగల సామర్థ్యంకూడా సంపాదించాడు.

ఆ నాడు దక్షిణాదిన నీటికొరత ఉండేది. అందుచేత కైలాస పర్వత మందున్న కావేరీనదిని అగస్త్యుని కమండలంలోకి వెళ్లవలిసినదిగా అతని ప్రార్థనపై ఈశ్వరుడు కావేరికి ఆజ్ఞ ఇచ్చాడు. దక్షిణయాత్రకు బయలుదేరిన అగస్త్యుని ముందు వింధ్య పర్వతుడు నతమస్తకు డయ్యాడు. నేను తిరిగి వచ్చువంతవరకు ఇలాగే ఉండాలని చెప్పి అగస్త్య దక్కిణ్ణించి బయలు దేరాడు.

అగస్త్యుడు సముద్ర జలాన్ని అంతటినీ తాగాడు. దేవతలు రాక్షసుల్ని హతమార్చారు. అగస్త్యుడు మరల వింధ్య పర్వతాన్ని దాటి వెళ్లిపోతే, ఆ పర్వతం మళ్లీ మీదికి లేచిపోతుంది. అందుచేత ఆ ముని కూర్గు కొండల్లో తపస్సు చేసుకొంటూ ఉండిపోయాడు.

అక్కడ గల సహ్యాద్రి శిఖర సురావద్మడనే అసురు డొకడుండే వాడు. ఇంద్రుడు వర్షాన్ని కురిపిస్తున్నా సురావద్మ డా వర్షాన్ని నేలమీద పడనివ్వకుండా చేస్తున్నాడు. ప్రజలు నీటి ఎద్దడికి బాధపడసాగారు. అందు చేత ఇంద్రుడు, అగస్త్యునికమండలంలో ఉన్న కావేరిని ఎలాగైనా బయటకు వచ్చేటట్టు చెయ్యాలని ఆలోచించాడు. విఘ్నేశ్వరుని వద్ద కేగి ఇంద్రుడు అంతా విన్నవించుకొన్నాడు. అప్పుడు గణపతి కాకి రూపం దాల్చి అగస్త్యుని కమండలంలో ఉన్న జలం వంపివేశాడు. కావేరి మహావేగంతో ప్రవహించ సాగింది. అలా జరగడానికి గల కారణాన్ని దివ్యదృష్టితో అగస్త్యుడు గ్రహించి, కావేరిని అలాగే ప్రవహించ మంటూ ఆజ్ఞాపించాడు.

కావేరీ నదిపై మైసూరుకి పన్నెండు మైళ్ల దూరంలో కృష్ణరాజ సాగర ప్రాజెక్టు ఉంది. దీనివల్ల 92 వేల ఎకరాల భూమి సాగు అవుతుంది. శివసముద్రం వద్ద గల జలపాతం వల్ల ఎంతో విద్యుచ్ఛక్తి తయారవు తూంది. మద్రాసు ప్రాంతంలో ఈ నదికి భవానీ అనే ఉపనది ఉంది.

తిరుచునాపల్లి వద్ద శ్రీరంగ ద్వీపం వల్ల కావేరీ నది రెండు పాయలుగా చీలిపోయింది. అక్కడే సారవంతమైన తంజావూరు డెల్టాభూములు ఉన్నాయి. ఒక ముని, కమండలంపై కూర్చుని నీటిని ఒలకబోస్తున్న కాకి ప్రతి మలు కావేరీ నది తీరంలో నేటికీ ఉన్నాయి.

—కాలిప వీరభద్రుడు